
సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 28 । జూన్ । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 1,760, మధ్య డెల్టాకు 1,260, పశ్చిమ డెల్టాకు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కె.ఆంజనేయులు (రావులపాలెం) మంగళవారం రూ.10,116 విరాళం సమర్పించారు.

ఆనందో.. రామబ్రహ్మం



సాహితీ గోదావరిలో ఆనంద కెరటాలు పరవళ్లు తొక్కాయి. గోదావరి ముద్దుబిడ్డ ఆచార్య బేతవోలు రామబ్రహ్మానికి కేంద్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కారం ప్రకటించడంపై సాహితీ అభిమానులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

II లో

న్యూస్‌రీల్

నేడు ఆర్టీసీ గ్రీవెన్స్

రాజానగరం: ఆర్టీసీకి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం బుధవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులకు అవసరమైన రవాణా సదుపాయాలు, బస్సుల్లో ప్రయాణికులకు ఎదురయ్యే వివిధ సమస్యలను సంబంధిత అధికారుల పర్యవేక్షణలో పరిష్కరిస్తారన్నారు.

పలు రైళ్ల రద్దు

రాజమహేంద్రవరం సిటీ: ఖరగ్‌పూర్ భద్రక్ రైల్వే సెక్షన్ మరమ్మతుల కారణంగా జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లను బుధ, గురు, శుక్రవారాల్లో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. బుధవారం షాలీమార్ – సికింద్రాబాద్ (22849), షాలీమార్ – సికింద్రాబాద్ (12773), తాంబరం – శాంత్రాగచ్చి (22842), హైదరాబాద్ – షాలీమార్ (18046), చెన్నై సెంట్రల్ – షాలీమార్ (22826), ఎస్ఎంవీటీ బెంగళూరు – హౌరా (22888), గురువారం ఎస్ఎంవీటీ బెంగళూరు – హౌరా (22888), శుక్రవారం సికింద్రాబాద్ – షాలీమార్ (22850) రైళ్లను రద్దు చేశామన్నారు.

జాబ్‌మేళాలో 22 మంది ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

నిడదవోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 20 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు తెలిపారు. టీసీఎల్, కాలిబ్ హెచ్‌ఆర్, ముత్తూట్ ఫైనాన్స్, నవతా ట్రాన్స్‌పోర్టు కంపెనీల ప్రతినిధులు హాజరై సుమారు 100 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే 64 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిలో వివిధ ఉద్యోగాలకు ఎంపికైన 22 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం. కొండలరావు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శుక్రవారం, నాలుగో మంగళవారం జాబ్‌మేళాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ రాజ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దళితులను ఆదుకుంటున్నది జగన్ ప్రభుత్వమే : తానేటి

కొవ్వూరు: దళితులకు ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి కుటుంబ సభ్యుడిలా ఆదుకుంటున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి మంత్రి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక పచ్చ పత్రికలో ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారన్నారు. ఏ సామాజిక వర్గానికి చెందిన మహిళలపై దాడులు జరిగినా పార్టీలకు అతీతంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో దళిత మహిళను వివస్త్రను చేసిన వారు ఎవరని వనిత ప్రశ్నించారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని చంద్రబాబు అహంకార పూరితంగా చేసిన వ్యాఖ్యలను దళితులు ఎప్పటికీ మరిచిపోరన్నారు. దళితులపై దాడులకు పాల్పడడంలో గత టీడీపీ ప్రభుత్వం దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచిందని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాజకీయంగాను, సామాజికంగాను దళితులకు ఎన్నో అవకాశాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాల మహిళలు ఆనందంగా ఉన్నారని ఆమె అన్నారు. ఈ విషయాలు ఆ పచ్చ పత్రికకు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

రేపట్నుంచి విష్ణుమూర్తిగా సత్యదేవుని దర్శనం

అన్నవరం: రత్నగిరిపై సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినం గురువారం నుంచి జూలై 3వ తేదీ వరకు దర్బారు మండపంలో శ్రీ సత్యదేవుడిని శ్రీమహావిష్ణువుగా అలంకరించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. స్వామి మహావిష్ణుమూర్తి విశేష అలంకరణతో భక్తులను అలరిస్తారన్నారు.

అమ్మ ఒడి.. చలో బడి



- నేడు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఆర్థిక సాయం జమ
- జిల్లాలో 1,55,768 మందికి ప్రయోజనం
- దేవరపల్లి హైస్కూల్లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పిల్లల చదువుకు పేదరికం అడ్డంకి కాకూడదనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం. ఈ ఆలోచన నుంచి ఆవిష్కృతమైనదే జగనన్న అమ్మ ఒడి పథకం. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఈ పథకాన్ని అమలు చేస్తూ విద్యావికాసానికి బాట వేస్తోంది. 2019–20 విద్యా సంవత్సరం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో ఏటా ఆర్థిక సాయం జమ చేస్తోంది. వరసగా నాలుగో ఏట కూడా జమ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంది. ఈ ఏడాదికి సంబంధించి బుధవారం అమ్మఒడి సాయం తల్లుల ఖాతాకు జమ కానుంది. అర్హులైన విద్యార్థులందరికీ పథకం వర్తింపజేసేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇప్పటికే అమ్మ ఒడి పథకం లబ్ధిదారులను జాబితాలు సచివాలయాల్లో నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. ఈ ఏడాది 1,55,768 మంది తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు చొప్పున రూ.233 కోట్ల మేర జమకానుంది. బుధవారం దేవరపల్లి హైస్కూల్లో హోంమంత్రి తానేటి వనిత ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

ప్రతి విద్యార్థి చదువుకోవాలనే:

ఏ ఒక్క పేద విద్యార్థి ఆర్థిక భారంతో చదువుకు దూరం కాకూడదనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచుగా చెప్పేమాట. గతంలో అనేక మంది పేదలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ చిన్నారులను బడికి పంపేవారు కాదు. బడికి పంపిస్తే ఫీజులు, పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్ తదితర అవసరాలకు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్న విద్యా కానుక పేరుతో స్కూల్ బ్యాగ్‌తో సహా అన్ని వస్తువులను ప్రభుత్వమే అందజేస్తోంది. ఈ ఏడాది కూడా పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు.

అధికారంలోకి రాగానే..

ప్రజా సంకల్ప యాత్రలో నిరుపేదల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసిన సీఎం జగన్ ప్రభుత్వ అధికారంలోకి రాగానే అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పథకం ద్వారా పాఠశాలకు చిన్నారులను పంపించే అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.13వేలు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేస్తున్నారు. మిగిలిన రెండు వేలలో రూ.1,000 డిస్ట్రిక్ట్ టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్(డీటీఎంఎఫ్), మిగిలిన రూ.1,000 డిస్ట్రిక్ట్ స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్(డీఎస్ఎంఎఫ్)కు జమ చేస్తారు. జిల్లా కలెక్టర్ నియంత్రణలో డీటీఎంఎఫ్, డీఎస్ఎంఎఫ్ నిర్వహించబడతాయి. ఈ పథకం లక్షలాది మంది కుటుంబాల్లో వెలుగులు నింపింది.



అర్హులందరికీ అందించేందుకు:

అమ్మ ఒడి పథకానికి అర్హులైన తల్లుల ఖాతాల్లో ఆర్థిక సాయం నేరుగా జమ చేస్తున్నారు. ఆధార్ కార్డుతో అనుసంధానం చేసిన బ్యాంకు అకౌంటులో అమ్మ ఒడి పథకం డబ్బులు జమ కానున్నాయి. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)కు ఆధార్ లింక్ అయిన అకౌంట్లకు మాత్రమే అమ్మ ఒడి నగదు నేరుగా జమ అవుతుంది. కచ్చితంగా తల్లి, తల్లి మరణించినా, దూరప్రాంతాల్లో సంరక్షకుల వద్ద ఉంటున్న వారి అకౌంట్లు ఆధార్ అనుసంధానమై ఉండాలి. ఈకేవైసీ చేసుకోక పోవడం వలన గతంలో కొంతమందికి డబ్బులు జమ కాలేదు. గతేడాది ఇటువంటి సమస్యలపై ప్రభుత్వం ఫోకస్ చేసింది. అర్హులైన అందరికీ అమ్మ ఒడి పథకం అందేలా సచివాలయ విద్యా వెల్ఫేర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు.

ఇబ్బందులు లేకుండా చదువు



జగన్ మావయ్య ఇస్తున్న ప్రోత్సాహంతో బాగా చదువుకుంటాను. మా అమ్మ ఖాతాకు రెండు సంవత్సరాలుగా అమ్మ ఒడి పథకం మొత్తం జమ అవుతోంది. ఈ సహాయంతో మాకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చుతోంది. చదువుకోడానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ ఎదురవ్వడం లేదు

– కాకి మణికంఠ, ఏడో తరగతి, లాలాచెరువు, రాజమహేంద్రవరం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ముఖ్యంగా అమ్మఒడి పథకం పిల్లలను చదివించేందుకు తోడుగా ఉంటోంది. ఈ పథకం ప్రధాన ఉద్దేశంపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పథకం లబ్ధి పిల్లలందరికీ చేరేలా కృషి చేస్తున్నాం.

– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి

మేనమామలా తోడు



పిల్లల చదువు చాలా తేలికగా మారింది. కష్టం తెలియకుండా పిల్లలను చదివించుకుంటున్నాం. ప్రైవేట్ స్కూలులో చదువుతున్నట్లు ఉంది. జగన్ మేనమామలా అన్నీ చూసుకుంటున్నారు. అమ్మ ఒడి పథకం మా పిల్లలను చదివించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రారంభం నుంచి ఈ పథకం అందుకుంటున్నాను.

– కే.దేవీవరలక్ష్మి, విద్యార్థి తల్లి

పాఠశాల స్థాయిలో సమావేశాలు

అమ్మ ఒడి పథకాన్ని బుధవారం అమలు చేయనున్న నేపథ్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో పేరెంట్ టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు .సమావేశంలో అమ్మ ఒడిలో భాగస్వాములైన తల్లులందరినీ పిలిచి ఈ నెల 20న జరిగిన జగనన్న ఆణిముత్యాలు వీడియోను తల్లులకు ప్రదర్శించారు. రాష్ట్రంలో విద్యాపరంగా ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న అమ్మ ఒడి, మన బడి నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్, స్కూల్ మేనేజ్‌మెంట్ ఫండ్, 3–10 తరగతులకు సబ్జెక్టు టీచర్స్ నియామకం, అఫిలియేషన్ టు సీబీఎస్ఈ, విద్యాపరమైన సంస్కరణలు, టీచర్ కెపాసిటీ బిల్డింగ్, ప్రతి మండలంలో బాలికలకు ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల ఏర్పాటు, డిజిటల్ లెర్నింగ్, పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం తదితర అంశాలను వివరించారు.

సంక్షేమ పథకాలతో అభివృద్ధి ఫలాలు

- తొలి దిషా సమావేశంలో ఎంపీ భరత్ రామ్
- పాల్గొన్న హోంమంత్రి, జడ్పీచైర్మన్, ఎమ్మెల్యేలు



సమావేశంలో పాల్గొన్న హోంమంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత, జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్యేలు సూర్యనారాయణ రెడ్డి , వెంకట్రావు, చంటిబాబు తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ ఫర్ సెల్ఫ్ హ్యూమన్ ఏజెన్సీ (దిషా) సమావేశం నిర్వహించినట్లు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. హోం మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా పాల్గొనగా సమన్వయ కర్తగా జిల్లా కలెక్టర్ మాధవీలత వ్యవహరించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ జిల్లాలో 20 శాఖలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికపై కూడా చర్చించామన్నారు. జిల్లా ఏర్పాటయ్యాక తరువాత దిషా సమావేశం జరిగిందన్నారు.

పథకాల ద్వారా ప్రయోజనం

జిల్లాలో జననీ సురక్ష కింద రూ.59.78 లక్షలు ఖర్చు చేసి 6,343 మందికి, జననీ శిశుసురక్ష యోజన కింద రూ.1.15 కోట్ల ద్వారా 6,250 మందికి ప్రయోజనం చేకూర్చినట్లు ఎంపీ తెలిపారు. ప్రధానమంత్రి మాత యోజన కింద 12,920 మందికి రూ.6.46 కోట్లు అందించామన్నారు. విద్యాశాఖ ద్వారా జగనన్న గోరుముద్ద కింద 984 పాఠశాలల్లో 10,7430 మందికి మేలు కలిగిందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా ఈ ఖరీఫ్ సీజనులో పంటల వివరాలను నమోదు చేశామన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా యంత్ర పరికరాలను అందిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా లక్షా రెండు వేల మందికి 57 లక్షల 82 వేల పనిదినాలు కల్పించామన్నారు. అమృత సరోవర్ కింద 75 చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ ద్వారా రూ.289 కోట్ల అంచనాలతో ప్రారంభించిన ప్రాధాన్య భవనాల నిర్మాణాలకు ఇప్పటివరకు రూ.193 కోట్లు ఖర్చు చేశామన్నారు.

పథకాల అమలులో జవాబుదారీతనం

హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాల అమలులో జవాబుదారీతనం ఉండాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రజాప్రతినిధులకు అందజేయాలన్నారు. అర్హత ఉండీ పథకాలు లబ్ధి పొందని వారు లేకుండా క్షేత్ర స్థాయిలో అధికారులు పనిచేయాలని సూచించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సభ్యులు పేర్కొన్న అంశాలను నమోదు చేసి తదుపరి సమావేశానికి కమిటీ ముందు ఉంచుతామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, శాసన సభ్యులు సత్తి సూర్యనారాయణ రెడ్డి, తలారి వెంకట్రావు, జ్యోతుల చంటిబాబు, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ప్రతినిధి సభ్యులు ధర్మేంద్ర కుమార్ జైన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన

గోపాలకృష్ణ ద్వివేది



జి.మామిడాడ హౌసింగ్ లేఅవుట్‌లో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న గోపాలకృష్ణ ద్వివేది

పెదపూడి: జగనన్న కాలనీ లేఅవుట్లలో త్వరలో డ్రెయిన్లు, రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది చెప్పారు. జి.మామిడాడలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను ఆయన, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తదితరులు మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఒక మొక్కను నాటారు. ఆయన హౌసింగ్ లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఇళ్లు నిర్మించుకునేది నిజమైన లబ్ధిదారులా కాదా అని అధికారులను అడిగారు. ఇళ్ల నిర్మాణానికి ఎంతమేర వ్యయం అవుతోంది, ఎలా నిర్మిస్తున్నారు లాంటి విషయాలపై లబ్ధిదారులను ప్రశ్నించారు. లబ్ధిదారులు తమకు తక్షణం డ్రెయినేజీ, రోడ్లు నిర్మించాలన్నారు. ఒక లబ్ధిదారుడు తమ ఇంటి మేడపైనున్న వాటర్ ట్యాంక్‌లో తాగునీరు కలుషితమవుతుందని చెప్పాడు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని కోరాడు. రెండు బాటిల్స్‌లో నింపిన నీటిని ఆయనకు చూపించాడు. వెంటనే ఆ నీటిని పరీక్షించి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడానికి కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. అనంతరం మండాది పద్మ, చిన్న రామకృష్ణ దంపతులు నిర్మించుకున్న కొత్త గృహాన్ని గోపాలకృష్ణ ద్వివేది రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు. ఆయనకు, కృతికా శుక్లాకు లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. ద్వివేది మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఎలా అమలు జరుగుతున్నాయో పరిశీలించామన్నారు. సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించామన్నారు. జగనన్న సురక్ష సర్వే జరుగుతోందన్నారు. జూలై 1 నుంచి గ్రామ సభలు నిర్వహించి సమస్యలు పరిష్కారస్తారన్నారు. జిల్లాలో సర్వే చురుగ్గా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం .శ్రీనివాసు, ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీపీ కేతా తులసి, సర్పంచి లంక మున్ని, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్చ్.. లాభం లేదు

- వరికి దూరమవుతున్న రైతులు
- లాభసాటి కావడంతో ఉద్యాన పంటల వైపు మొగ్గు
- చేలు మెరక చేసి కొబ్బరి, ఇతర పంటల సాగు
- ముంపు భయంతో తీర ప్రాంతంలో ఆక్వాకు సై

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టా అంటేనే ఆంధ్రులకు అన్నపూర్ణ. ధాన్యాగారంగా పేరు. అటువంటి డెల్టాలో వరి సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గుతోంది. వరి గిట్టుబాటు కాకపోవడం.. ఉద్యాన పంటలు, ఆక్వా సాగు కాసులు కురిపిస్తూండటంతో వీటిపై వరి రైతులు దృష్టి సారిస్తున్నారు. గోదావరి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల్లో ఇంచుమించు ఇదే పరిస్థితి ఉండగా, జిల్లాలో వరిని వదిలి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లిపోతున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది.

గోదావరి డెల్టా ఆయకట్టు 10.13 లక్షల ఎకరాలు. ఇందులో 8.96 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. డెల్టాలోని మెరక ప్రాంతాల్లో చేలను మట్టితో మెరక చేసి కొబ్బరి, అరటి వంటి ఉద్యాన పంటలు సాగు చేయడం, తీరంలోని చేలను చేపల చెరువులుగా మార్చడం 1995 వరకూ ఉంది. ఆ తరువాత నుంచి వరి చేలను ప్రత్యామ్నాయ పంటల వైపు మార్పు చేసే వేగం పెరిగింది. గత దశాబ్ద కాలంగా ఇది మరింత జోరందుకుంది. ఇప్పుడు మూడు డెల్టాల్లోనూ సుమారు 6.90 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరుగుతోందని అంచనా. అంటే సుమారు 2.06 లక్షల ఎకరాల్లో (23 శాతం) వరికి ప్రత్యామ్నాయ సాగు వచ్చి చేరింది. జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టాల్లో 3.03 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, ఒకటిన్నర దశాబ్దాల కిందట 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగేది. ప్రస్తుతం గత రబీలో 1.53 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగవడం గమనార్హం.

ఉద్యాన సాగుతో 'కాసుల' పంట

భారీ వర్షాలు, వరదల వల్ల కొంత కాలం నుంచి డెల్టాలో వరి సాగు ఇబ్బందికరంగా మారింది. పంట పండినా పెద్దగా లాభసాటి కావడం లేదు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి పెడుతున్నారు. ఇటీవల ఉద్యాన పంటల సాగు లాభసాటిగా మారింది. కొబ్బరి, పోక, కోకో వంటి దీర్ఘకాలిక పంటలతో పాటు అరటి, పసుపు, కంద, పూల సాగు కాసుల పంట పండిస్తోంది. ఈ సాగులో నష్టాలు, కష్టాలు ఉన్నా లాభాలు మాత్రం గణనీయంగా వస్తున్నాయి. దీంతో రైతులు చేలను మెరక చేసి మరీ వీటి సాగు ఆరంభించారు. కోనసీమలో కొత్తపేట, రావులపాలెం, అంబాజీపేట, పి.గన్నవరం, కపిలేశ్వరపురం మండలాల్లో ఈ మార్పు అధికంగా కనిపిస్తోంది. పైగా ఉద్యాన పంటలకు ప్రభుత్వం నుంచి పలు రాయితీలు ఇస్తూండటం, మార్కెటింగ్ సౌకర్యాలు పెరగడంతో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా వీటి చేపట్టారు.

తీరంలో ఆక్వా



ఉప్పలగుప్తం మండలం కూనవరంలో వరికి బదులు మామిడి, కొబ్బరి సాగు

ఆక్వా సాగు వల్ల కాలుష్యం పెరుగుతున్నా తీరంలోని ముంపు ప్రాంతాల్లో వరికి ఇదే ప్రత్యామ్నాయంగా మారింది. ఇటీవల ఏటా వేసవిలో వరి చేలు ఆక్వా చెరువులుగా మారిపోతున్నాయి. జిల్లాలోని ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి వంటి తీర ప్రాంత మండలాలతో పాటు అమలాపురం, రాజోలు, కె.గంగవరం, అంబాజీపేట వంటి తీరానికి దూరంగా ఉన్న మండలాల్లో సైతం చేలను చెరువులుగా మార్చేస్తున్నారు.

వరి కాదని మొక్కజొన్న



కొత్తపేట మండలం బిళ్లకుర్రులో రబీలో మొక్కజొన్న సాగు (ఫైల్)

కొత్తపేట మండలంలో ఏటా రబీలో సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. బిళ్లకుర్రు, వాడపల్లి, అవిడి ప్రాంతాల్లో సాధారణంగా రబీలో అధిక వరి దిగుబడి వస్తోంది. ఎకరాకు 45 బస్తాల (75 కేజీలు) నుంచి 50 బస్తాల వరకూ దిగుబడి లభిస్తోంది. ఖరీఫ్‌తో పోలిస్తే రబీ వరిలోనే లాభం వస్తుంది. అయినప్పటికీ ఇక్కడి రైతులు వరిని వదిలేసి మొక్కజొన్న సాగుకు మళ్లడం గమనార్హం. వానపల్లిలో 520 ఎకరాల సాగుభూమి ఉండగా, రబీలో 200 ఎకరాల్లో మొక్కజొన్న వేస్తున్నారు.

అందుకే ఆక్వా సాగు

ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో 2,054 ఎకరాల ఆయకట్టు ఉంది. పదేళ్ల క్రితం సుమారు 500 ఎకరాల్లో ఆక్వా సాగు జరిగేది. మిగిలిన 1,554 ఎకరాలూ వరి ఆయకట్టు. ఇప్పుడు 60 ఎకరాల్లో మాత్రమే వరి ఆయకట్టు మిగిలింది. ముంపునకు తోడు, వరి సాగు గిట్టుబాటు కాకపోవడం.. ఆక్వా చెరువులు తవ్వితే పంట సాగు చేయకున్నా ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకూ లీజుల రూపంలో వస్తూండటంతో రైతులు ఆక్వా సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.



కాట్రేనికోన మండలం వేట్లపాలెంలో ఒకప్పుడు వరి సాగు జరిగే ప్రాంతాల్లో ఆక్వా చెరువులు

క్లుప్తంగా

ఐఐఎంలో సీట్లు సాధించిన శ్రీ షిర్డి సాయి విద్యార్థులు





ఐఐఎంలో సీట్లు సాధించిన విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిప్మాట్ ఫలితాల్లో రాజమహేంద్రవరం శ్రీ షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐఐఎంలో సీట్లు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. తమ డాఫ్నీ సివిల్స్ అకాడమీలో శిక్షణ పొందిన సీహెచ్ గణేష్, శైలజ, ఎస్.ప్రణవలు జమ్మూలోని ప్రతిష్టాత్మక ఐఐఎంలో ఐదేళ్ల బీబీఏ, ఎంబీఏ కోర్సు అభ్యసించడానికి సీట్లు సాధించారన్నారు. జమ్మూతో పాటు బోధగయ ఐఐఎంలో కూడా సీట్లు సాధించారన్నారు. ఈ విజయం పట్ల శ్రీ షిర్డి సాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. తమ సివిల్స్ అకాడమీలో శిక్షణ పొందిన మరింత మంది విద్యార్థులు ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో కూడా సీట్లు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డాఫ్నీ అకాడమీ డీన్ రాజేష్ అభినందించారు.

కుమార్తెపై హత్యాయత్నం.. తల్లికి నాలుగేళ్ల జైలు

రాజమహేంద్రవరం రూరల్: కుమార్తెపై హత్యాయత్నం చేసిన తల్లికి మూడేళ్లు, అలాగే 75 జేజే యాక్ట్ కింద ఏడాది జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ అసిస్టెంట్స్ సెషన్స్ జడ్జి ప్రవీణ్ కుమార్ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. దివాన్ చెరువు గ్రామానికి చెందిన మచ్చా శారద ఒక వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంది. వీరి వ్యవహారానికి పెద్ద కూతురు మహాలక్ష్మి అడ్డం వస్తోందని భావించింది. ఈ నేపథ్యంలో 2018 జూన్ 20వ తేదీ రాత్రి శారద తన కూతురు మహాలక్ష్మికి చీమల మందు తాగించి, తుప్పల్లోకి తీసుకువెళ్లి శరీరంపై బ్లేడుతో గాయపరిచింది. ఈ సంఘటనపై 2018 జూన్ 21న శారద చెల్లెలు కృష్ణవేణి బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ కేవీ మోహన్‌రెడ్డి దర్యాప్తు చేసి, చార్జిషీటు వేశారు. కేసును పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ కోడి సతీష్ నాయుడు వాదించారు.

ఆనందో.. రామబ్రహ్మం



ఆచార్య బేతవోలు రామబ్రహ్మం దంపతులతో అభిమానులు



గణపతి సచ్చిదానంద స్వామితో..

- ఆచార్య బేతవోలుకు సాహిత్య అకాడమీ పురస్కారంపై సర్వత్రా హర్షం
- సంస్కృత, తెలుగు భాషలకు విశేష సేవ
- బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఖ్యాతి

నల్లజర్ల: సాహితీ గోదావరిలో ఆనంద కెరటాలు పరవళ్లు తొక్కాయి. గోదావరి ముద్దుబిడ్డ ఆచార్య బేతవోలు రామబ్రహ్మానికి కేంద్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కారం ప్రకటించడంపై సాహితీ అభిమానులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. శాస్త్రీయ, మధ్యయుగ సాహిత్య రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. సంస్కృతం, తెలుగు భాషల్లో ప్రముఖ పండితుడయిన ఆయన.. కవి, అనువాదకుడు, వ్యాకరణవేత్త, అష్టావధానం, కవిత్వం, నాటకాలు, కథలు, అనువాదాలు, సాహిత్య వ్యాసాలు, పరిశోధనల్లో ఎంతో ఖ్యాతికెక్కారు. గతంలో అనేక ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు. ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చిన నేపథ్యంలో స్వగ్రామం నల్లజర్లలోని ఆయన మిత్రులు, అభిమానులు, గ్రామస్తులు ఆనందడోలికల్లో మునిగి తేలుతున్నారు.

విద్యాభ్యాసం

ఆచార్య బేతవోలు రామబ్రహ్మం నల్లజర్ల గ్రామంలో అతి సామాన్య కుటుంబంలో 1948 జూన్ 10వ తేదీన సత్యనారాయణమూర్తి, రాధా రుక్మిణి దంపతులకు జన్మించారు. తండ్రి ఆర్‌అండ్‌బీ శాఖలో గుమస్తాగా పని చేసేవారు. కష్టాలే తోడు అన్నట్టుగా రామబ్రహ్మం ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. కొవ్వూరు సంస్కృత పాఠశాలలో భాషా ప్రవీణ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చదివారు. తదనంతరం నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య తూమాటి దోణప్ప పర్యవేక్షణలో 'తెలుగు వ్యాకరణాలపై సంస్కృత వ్యాకరణాల ప్రభావం' అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు.

ఉద్యోగ జీవితం

చదువు పూర్తయిన అనంతరం తొలిసారిగా గుంటూరు కేవీకే కళాశాలలో రామబ్రహ్మం ఉపన్యాసకులుగా చేరారు. ఆయన బోధన విద్యార్థులకే కాకుండా సహాధ్యాపకులైన మల్లంపల్లి వీరేశ్వరశర్మ, కోగంటి సీతారామాచార్యులు, జమ్ములమడక మాధవరామశర్మ వంటి పండితులను సైతం ఆకర్షించింది. తదనంతరం రామబ్రహ్మం నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పని చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఎన్‌టీ రామారావు ఆ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో రామబ్రహ్మం పద్యాలు విని ఎంతో మురిసిపోయారు. 'త్వరలో మేం ఏర్పాటు చేయబోయే తెలుగు విశ్వవిద్యాలయంలో మీవంటి వారు అవసరం. త్వరలో కలుద్దాం' అని వెళ్లిపోయారు. అనంతరం కళలకు సంబంధించి తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించి, రాజమహేంద్రవరం సమీపాన బొమ్మూరు కేంద్రంగా సాహిత్య పీఠం ఏర్పాటు చేశారు. ఈ పీఠంలో రామబ్రహ్మాన్ని ఆచార్యునిగా నియమించారు. తెలుగు సాహిత్య అధ్యయనం రూపకల్పన, పరిశోధనల్లో పెనుమార్పులు తీసుకువచ్చిన రామబ్రహ్మం భావితరాలకు మార్గదర్శకునిగా కీలక పాత్ర పోషించారు. ఆయన మార్గదర్శకత్వంలో 25 మంది వరకూ పీహెచ్‌డీలు చేసి పట్టాలు పొందారు. అనంతరం రామబ్రహ్మం 2005లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా చేరారు. వర్ణన రత్నాకరానికి 23 సంపుటాలుగా ఆయన చేసిన వ్యాఖ్యానం అపూర్వ కృషిగా గుర్తింపు పొందింది.

తెలుగు భాషకు బహుముఖ సేవలు

తొలి నాళ్లలో నాస్తిక భావాలున్న రామబ్రహ్మానికి ఆధ్యాత్మిక దిగ్దర్శకత్వం నెరపిన వారు లక్ష్మణ యతీంద్రులు. బేతవోలుకు దిశానిర్దేశం చేసి ఆచార్యునిగా తీర్చిదిద్దిన వారు ఆచార్య తూమాటి దోణప్ప. భాషాప్రవీణ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడే రావూరి వెంకటేశ్వర్లు ప్రోత్సాహం, ప్రేరణతో రామబ్రహ్మం అవధానాల వైపు ఆకర్షితులయ్యారు. పద్దెనిమిది సంవత్సరాల వయస్సులోనే 1967 నవరాత్ర ఉత్సవాల్లో మొదటి అవధానం చేశారు. దాదాపు 25 సంవత్సరాల్లో 300 పైగా అవధానాలు చేసి, తెలుగు సాహితీ అభిమానుల హృదయాలను దోచుకున్నారు. అనంతరం లెక్కకు మిక్కిలిగా అవధాన సభలకు సంచాలకత్వం వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం బొమ్మూరు సాహిత్య పీఠం తరఫున 'వచన కవిత్వ షష్టిపూర్తి' శీర్షికన కవి సమ్మేళనాలు, సభలు నిర్వహించారు. తర్వాత హైదరాబాద్‌లో ఆంధ్ర పద్య కవితా సదస్సు నిర్వహించారు. నండూరి రామకృష్ణమాచార్యులు అధ్యక్షుడిగా, రామబ్రహ్మం ఉపాధ్యక్షుడిగా రాష్ట్రం నలుదిశలా పర్యటించి పద్యం విశిష్టతను చాటి చెప్పారు. ఆయన 'కొత్త గోదావరి' వంటి పద్య కావ్యాలే కాకుండా నాటకాలు కూడా రచించారు. కథలు, అనువాద రచనలు, సాహిత్య వ్యాసాలు, పరిశోధన గ్రంథాలు రాసారు. సంస్కృత నాటకాలకు వ్యాఖ్యానాలు రాసి ఎనలేని కీర్తి గడించారు. దేవీ భాగవతం వచన రచన ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు.



నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నుంచి సత్కారం అందుకుంటున్న ఆచార్య రామబ్రహ్మం



సాహితీ సభలో మాట్లాడుతున్న ఆచార్య రామబ్రహ్మం

అసలైన అంబేడ్కర్ వాది తారకం

విగ్రహావిష్కరణ సభలో మంత్రి విశ్వరూప్



బొజ్జా తారకం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ తదితరులు

ముమ్మిడివరం: చివరి శ్వాస వరకూ అసలైన అంబేడ్కరిజాన్ని ఆచరించి, ఆయన ఆశయాలను అమలు చేసిన మహోన్నత వ్యక్తి బొజ్జా తారకం అని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. తారకం 84వ జయంత్యుత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బుద్ధ పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయన నిలువెత్తు శిలా విగ్రహాన్ని మంత్రి విశ్వరూప్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. సంబంధిత శిలాఫలకాన్ని ప్రముఖ రచయిత, తారకం సతీమణి విజయ భారతి, పతాకాన్ని పి.అంజయ్య ఆవిష్కరించారు. అనంతరం టీటీఆర్ కల్యాణ మండపంలో ఎ.రామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి విశ్వరూప్ మాట్లాడారు. కుల దౌష్ట్యానికి, వర్గ దోపిడీకి గురవుతున్న నిరుపేదల పక్షాన న్యాయ పోరాటం చేసి, వారి హక్కులను పరిరక్షించడమే కాకుండా, అంబేడ్కర్ చెప్పిన విలువలను తు.చ. తప్పకుండా పాటించి, సమాజంలో స్ఫూర్తి నింపిన వ్యక్తి తారకం అని కొనియాడారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ, అంబేడ్కర్‌ను పూర్తిగా చదివి, రాజ్యాంగంపై అవగాహనతో అణగారిన వర్గాల ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా జీవిత కాలం పోరాడిన నిజమైన అంబేడ్కర్ వాది తారకం అని అన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడ అన్యాయం జరిగినా ముందుండే వ్యక్తి తారకం అని, అటువంటి మహనీయుడు ఈ ప్రాంతం వాడు కావడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో విగ్రహ దాత నేరేడిమిల్లి వెంకట్, విగ్రహ కమిటీ కన్వీనర్ పెనుమాల సుధీర్, సభ్యులు పాల్గొన్నారు.

మెడికో అనుమానాస్పద మృతి



కొడుకు మృతదేహంపై పడి దుఃఖిస్తున్న తల్లిదండ్రులు



శ్రీకృష్ణ కేదార్ (పాత చిత్రం)

రాజానగరం: వైద్య కళాశాల క్యాంపస్‌లో ఓ మెడికో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. పోలీసులు, తల్లిదండ్రుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొండూరు శ్రీకృష్ణ కేదార్ (27) అలియాస్ శృంగేరి జీఎస్ఎల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, పీజీ (పీడియాట్రిక్స్) సెకండియర్ చదువుతున్నాడు. కళాశాల ప్రాంగణంలోని స్టాఫ్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఏం జరిగిందో ఏమో కానీ మంగళవారం ఉదయం 6.55 గంటల సమయంలో స్టాఫ్ క్వార్టర్స్ సమీపంలోని కారిడార్ వద్ద అతడు విగతజీవిగా పడి ఉన్నాడు. అతడిని గమనించిన వారు వెంటనే సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తికి సమాచారం అందించారు. ఆయన వెంటనే అక్కడకు చేరుకున్నారు. కేదార్‌ను పరీక్షించగా అప్పటికే అతను మరణించినట్టు గుర్తించారు. దీంతో అక్కడి నుంచే అతడి తల్లిదండ్రులకు, స్థానిక పోలీసులకు డాక్టర్ మూర్తి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రాజమహేంద్రవరం తూర్పు మండలం డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, స్థానిక సీఐ కాశీ విశ్వనాథ్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. అంతలోనే మృతుని తల్లిదండ్రులు కూడా అక్కడకు చేరుకున్నారు.

శరీరం నిండా నెత్తుటి గాయాలు, కవుకు దెబ్బలు

మృతుని చెవుల నుంచి రక్తం కారడం, శరీరంపై నెత్తుటి గాయాలు, కవుకు దెబ్బలు ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంతటి పిరికివాడు కాదని, ఇది ఏమాత్రం ఆత్మహత్య కాదని తండ్రి శివరామలింగేశ్వరరావు అన్నారు. కేదార్ మృతిపై తమకు అనుమానం ఉందని, దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి, న్యాయం చేయాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మెడికో మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. మృతుని ఫోన్ డేటా పరిశీలించగా.. సోమవారం రాత్రి నుంచి తెల్లవారుజామున 6.42 గంటల వరకూ తల్లిదండ్రులతో తరచూ మాట్లాడుతున్నట్టు ఉందని డీఎస్పీ చెప్పారు. అన్ని కోణాల్లోనూ ఈ కేసు దర్యాప్తు జరుగుతుందని తెలిపారు.

ముగ్గురు అన్నదమ్ములకు ఒక్కడే వారసుడు

మృతుడు కేదార్ తండ్రి శివరామలింగేశ్వరరావుకు ఇద్దరు సోదరులున్నారు. ఈ ముగ్గురికీ కేదార్ ఒక్కడే వారసుడు. 'ముగ్గురు అన్నదమ్ములైన మాకు ఒక్కడే వారసుడు కావడంతో అందరం అల్లారుముద్దుగా పెంచుకున్నాం. మెడిసిన్ చేస్తానంటే చదివించాం. ఎంబీబీఎస్ తరువాత పీజీ చేస్తానంటే ఒకే అన్నాం. ఇలా వాడు అడిగింది ఏదీ కాదనకుండా వచ్చిన మాకు ఇలా కడుపు శోకం మిగులుస్తాడనుకోలేదు' అంటూ కేదార్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

మండపేట: మోటార్ సైకిళ్లు, వాటి డిక్కీలు పగులగొట్టి నగదు చోరీలకు పాల్పడుతున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,92,300 నగదు, మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక కృష్ణా థియేటర్ వద్ద ఈ నెల 19వ తేదీన నిలిపి ఉంచిన మోటార్ సైకిల్ డిక్కీని గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి, అందులోని రూ.62 వేల నగదు చోరీ చేశారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై ఎం.అశోక్ దర్యాప్తు చేపట్టారు. ఇది అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనిగా గుర్తించి, వారి కోసం ఎస్సై అశోక్, ఏఎస్సై జి.చిన్నారావు పర్యవేక్షణలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలించారు. స్థానిక బైపాస్ రోడ్డులో సోమవారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. చిత్తూరు జిల్లాకు చెందిన వీరిని పి.శరవణ, ఆర్.ప్రకాష్, వి.శామ్యూల్, ఎస్.సత్యవేలుగా గుర్తించారు. వీరు మండపేటతో పాటు రామచంద్రపురం, కడియం, పశ్చిమ గోదావరి జిల్లా కోడూరు, పల్నాడు జిల్లా చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, ప్రొద్దుటూరు, తమిళనాడుల్లో స్కూటర్ డిక్కీ నేరాలు, తిరుపతి, నెల్లూరు తదితర చోట్ల మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసు దర్యాప్తులో అమలాపురం సీఐ డి.గోవిందరావు సహకారం అందించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై అశోక్, ఏఎస్సై చిన్నారావు, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, కానిస్టేబుళ్లు ఎస్.బ్లేస్సస్, జి.రమేష్, సీహెచ్ ఏసు, ఎన్.సతీష్‌లను డీఎస్పీ ప్రసాద్ అభినందించి, నగదు పురస్కారాలు అందజేశారు. నిందితులను అరెస్టు చేశామని, కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు. మీడియా సమావేశంలో ఎస్సై కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పారిశ్రామికవేత్తల సహకారం అవసరం



బీసీ హాస్టల్‌లో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న గోపాలకృష్ణ ద్వివేది, కృతికా శుక్లా

పెద్దాపురం: విద్యాభివృద్ధికి పారిశ్రామికవేత్తల సహకారం ఎంతో అవసరమని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ప్రిన్సిపాల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అన్నారు. స్థానిక లలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేతలు మట్టే శ్రీనివాస్, సత్యప్రసాద్‌లు సీఎస్ఆర్ ఫండ్ కింద పెద్దాపురం బీసీ బాలికల వసతి గృహానికి మంజూరు చేసిన ఆర్‌ఓ ప్లాంట్, బెడ్‌లు, టీవీ, క్రీడా వస్తువులు తదితర పలు పరికరాలను వారు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమాధికారి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ, విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, మరిన్ని సేవలందించేందుకు ప్రభుత్వంతో పాటు పారిశ్రామికవేత్తల సహకారం కూడా ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో లలితా ఇండస్ట్రీస్ ఈడీ మట్టే ఆదిత్యకృష్ణ, ఆర్డీఓ ఎ.బాబు, కాకినాడ ఆర్డీఓ సత్యనారాయణ, తహసీల్దార్ జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ఏడీఏ దైవకుమార్, ఏఓ సంజయ్, బీసీ వసతిగృహ పెద్దాపురం సబ్ డివిజన్ సంక్షేమాధికారి నాగేశ్వరి, వసతి గృహ సంక్షేమాధికారి శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి లెక్క తేలింది

- స్త్రీనిధి నిధులు రూ.9 లక్షల దుర్వినియోగం
- నిగ్గు తేల్చిన అధికారులు
- విచారణ మధ్యలో సొమ్మసిల్లిన వీఓఏ
- స్వాహా చేసిన సొమ్ము 10లోగా చెల్లించేందుకు అంగీకారం



ఖండవల్లిలో డ్వాక్రా మహిళలను విచారిస్తున్న స్త్రీనిధి జిల్లా మేనేజర్ రత్నకుమారి

పెరవలి: ఖండవల్లి గ్రామంలో స్త్రీనిధి నిధుల అవినీతి వ్యవహారం నిగ్గు తేల్చారు అధికారులు. గ్రామంలో 8 గ్రామ సంఘాల పరిధిలో 310 డ్వాక్రా గ్రూపులున్నాయి. వీటిలో 7వ గ్రామ సంఘానికి మొల్లేటి శ్రీదుర్గ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీఓఏ)గా పని చేస్తోంది. ఈ గ్రామ సంఘం పరిధిలో 32 డ్వాక్రా గూపులున్నాయి. వీటిలో 16 గ్రూపుల నుంచి స్త్రీనిధి రుణాలు పక్కదారి పట్టినట్టు గతంలో డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేయడం, దీనిపై అధికారులు విచారణ జరపడం తెలిసిందే. డ్వాక్రా మహిళల పేరిట రుణాలు తీసుకొని, తిరిగి చెల్లించకపోవడం, డ్వాక్రా సంఘాన్ని ఆడిట్ చేయించకపోవటంతో ఈ అవినీతి బాగోతం వెలుగు చూసింది. పూర్తి విచారణ అనంతరం వీఓఏ శ్రీదుర్గ రూ.9 లక్షలు స్వాహా చేసినట్టు తేలిందని స్త్రీనిధి జిల్లా మేనేజర్ ఎం.రత్నకుమారి తెలిపారు. ఆమె మంగళవారం ఉదయం 7వ గ్రామ సంఘం పరిధిలోని 16 డ్వాక్రా గ్రూపుల సభ్యులను పిలిచి, ఒక్కో సంఘంతో వీఓఏ శ్రీదుర్గ ఎదురుగానే విచారణ జరిపారు. మొత్తం 16 డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన అన్ని పుస్తకాలూ వీఓఏ తన వద్దే ఉంచుకుందని, ఎంతమంది అడిగినా ఇవ్వలేదని సభ్యులు తెలిపారు. కట్టిన సొమ్ములకు కూడా ఎన్నిసార్లు అడిగినా రశీదులు ఇవ్వలేదని చెప్పారు. శ్రీదుర్గ వద్ద ఉన్న పుస్తకాలు తీసుకురావాలని జిల్లా మేనేజర్ రత్నకుమారి తీవ్ర స్థాయిలో చెప్పడంతో బ్యాంకు పాస్ పుస్తకాలు తీసుకువచ్చి గ్రామ సంఘం అధ్యక్షురాలు పెట్టా భువనేశ్వరికి అప్పగించారు. ఆ గ్రూపుల సభ్యులు తెలిపిన విధంగా తాను నిధులు వాడుకున్నట్టు శ్రీదుర్గ అంగీకరించింది. స్వాహా చేసిన రూ.9 లక్షలు తిరిగి చెల్లించడానికి నెల రోజుల గడువు కావాలని తొలుత ఆమె కోరగా, స్త్రీనిధి మేనేజర్ అంగీకరించలేదు. దీంతో ఆ మొత్తాన్ని వచ్చే నెల 10వ తేదీలోగా చెల్లిస్తానని శ్రీదుర్గ లిఖిత పూర్వకంగా తెలిపింది. విచారణ సందర్భంగా ఒక సమయంలో వీఓఏ తీవ్ర ఒత్తిడికి గురై, సొమ్మసిల్లిపోవడంతో సభ్యులు సపర్యలు చేశారు.

బ్యాంక్ లింకేజీపై దృష్టి సారించాలి

ఈ రూ.9 లక్షలు స్త్రీనిధివి మాత్రమేనని, బ్యాంక్ లింకేజీ రుణాల్లో ఇంకేమైనా స్వాహా జరిగిందా అనేది మరింతగా విచారిస్తేనే కానీ తెలియదని చెబుతున్నారు. బ్యాంక్ లింకేజీకి సంబంధించి రూ.60 వేలు పక్కదారి పట్టినట్టు విచారణ సందర్భంగా వెన్నెల గ్రూప్ సభ్యులు తెలిపారు. ప్రతి నెలా జమ చేసే విధంగా వీఓఏకి నెలకు రూ.15 వేల చొప్పున 4 నెలలు ఇచ్చామని సంఘ సభ్యులు చెబుతూండగా, తనకు ఇవ్వలేదని వీఓఏ అనడంతో ఈ విషయాన్ని పక్కన పెట్టారు. నిధుల స్కామ్ జరిగిందని విచారణలో తేలడంతో అప్పటి వరకూ ఆసరా నిధుల కోసం ఆ సంఘాలకు చెందిన 80 మంది సభ్యుల వేలిముద్రలు వేయించకపోవటంతో సభ్యులు గగ్గోలు పెట్టారు. దీనిపై ఇన్‌చార్జి ఏపీఎం రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చి సభ్యుల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయించారు.

మరో సంఘంలోనూ..

ఖండవల్లి గ్రామసంఘం–1లో కూడా రూ.5 లక్షల నిధులను ఆ సంఘం వీఓఏ స్వాహా చేసినట్టు అధికారుల విచారణలో తేలింది. దీనిపై స్త్రీనిధి జిల్లా మేనేజర్ ఆగ్రహించటంతో రూ.3.50 లక్షలు జమ చేయటంతో ఈ విషయం అప్పటికప్పుడే సద్దుమణిగింది. మిగిలిన రూ.1.50 లక్షలు అరుణగిరి గ్రూప్ రుణం తీసుకుందని వీఓఏ చెప్పడంతో ఆ గ్రూపు సభ్యులను విచారణకు తీసుకురావాలని వీఓఏను ఆదేశించారు. విచారణలో ఇన్‌చార్జి ఏపీఎం బి.నాగరాజు, సీసీలు కనకదుర్గ, వివిధ గ్రామాల వీఓఏలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో స్థలం అమ్మకం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

రాజానగరం: వేరొకరి స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా తప్పుడు పత్రాలు చూపించి, ఆ స్థలాన్ని తమదిగా ఇంకొకరికి విక్రయించి, రిజిస్ట్రేషన్లు కూడా చేయిస్తున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను రాజమహేంద్రవరం తూర్పు మండలం డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు మంగళవారం సాయంత్రం ఇక్కడ విలేకర్లకు తెలిపారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పట్నాల శివప్రసాద్‌కు తండ్రి జగన్నాథరావు ద్వారా వచ్చిన 795 గజాల ఇంటి స్థలం రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధి రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరులో ఉంది. ఆ స్థలం చుట్టూ కంచె వేసి, తరచూ వచ్చి చూసుకుంటూ వెళ్లేవారు. అయితే కొన్ని రోజుల క్రితం ఆ స్థలంలో మట్టి వేసి ఉండటం, సరిహద్దు రాళ్లు పాతి ఉండటాన్ని గుర్తించిన శివప్రసాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించగా వేరెవరికో విక్రయించినట్టు ఉంది. దీంతో వెంటనే ఆయన రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలు, ఆధార్ కార్డు సహా స్థలానికి సంబంధించి ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసి రూ.1.20 కోట్ల విలువైన ఆ స్థలాన్ని రూ.50 లక్షలకే ఒక ముఠా విక్రయించినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆ ముఠాకు చెందిన కొత్తల రామకిషోర్, పడాల శ్రీను, జక్కపు హరీష్, కానూరి శ్రీనివాస కిషోర్, సయ్యద్ రఫీ, కాశీ రాజ్‌కిషోర్, విప్పర్తి విజయ్‌కాంత్, గంటా నరసింహమూర్తిలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారందరూ రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన వారే కావడం విశేషం.

ఖాళీ స్థలాలుంటే అప్రమత్తంగా ఉండాలి

భూముల విలువ అమాంతం పెరిగిపోతున్న నేపథ్యంలో కొన్ని దుష్టశక్తులు ఖాళీ స్థలాలపై కన్ను వేసి, కబ్జా చేస్తున్నాయని డీఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. ఖాళీ స్థలాలున్న వారు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అవకాశం ఉన్నంత వరకూ స్థలం ఖాళీగా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విలేకర్ల సమావేశంలో సీఐ కాశీ విశ్వనాథ్, ఎస్సై సుధాకర్ కూడా పాల్గొన్నారు.

రూ.2 వేల నోట్లు ఇస్తామని.. రూ.5 లక్షలకు టోకరా



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విజయపాల్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తమకు కొంత సొమ్ము ఇస్తే దానికి రెట్టింపు రూ.2 వేల నోట్లు ఇస్తామంటూ మాయమాటలు చెప్పి, డబ్బులు కాజేసిన ముగ్గురిని ప్రకాష్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ విజయపాల్ ఈ వివరాలు తెలిపారు. అన్నవరానికి చెందిన భారతి తన స్థలం అమ్మేందుకు మధ్యవర్తులను ఆశ్రయించింది. ఈ క్రమంలో కల్లూరి సురేష్ అనే వ్యక్తి భారతితో ఆ స్థలాన్ని వేరే వ్యక్తికి అమ్మించాడు. దీనికిగాను అడ్వాన్స్‌గా ఆమెకు రూ.3 లక్షలు ఇచ్చారు. మనం డబ్బులు ఇస్తే తిరిగి రెట్టింపు రూ.2 వేల నోట్లు ఇస్తారని చెప్పాడు. దీనికిగానూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన బాణాల దత్తాత్రేయను పరిచయం చేశాడు. అతడు భారతికి ఫోన్‌లో వివరాలు చెప్పాడు. దీనికి ఆమె సరేననడంతో మండపేటకు చెందిన అత్రు వీరబాబు అనే వ్యక్తిని పురమాయించాడు. రాజమహేంద్రవరం పాత సోమాలమ్మ గుడి వద్దకు రమ్మని, అక్కడకు వీరబాబు వస్తాడని అతడికి డబ్బులు ఇవ్వాలని దత్తాత్రేయ చెప్పాడు. దీంతో భారతి ఇటీవల రూ.2.50 లక్షలు తీసుకుని అక్కడకు వెళ్లింది. ఆమె నుంచి ఆ సొమ్ము తీసుకున్న వీరబాబు ఇప్పుడే వస్తానని చెప్పి ఉడాయించాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న భారతి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరు ఇదేవిధంగా కొద్ది రోజుల క్రితం మరో వ్యక్తిని మోసం చేసి రూ.2.50 లక్షలు కాజేశారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.3.22 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మొదటి నిందితుడు దత్తాత్రేయపై గంజాయి, రెండో నిందితుడు వీరబాబుపై హత్యాయత్నం కేసులు ఉన్నాయి. వీరిని అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. నేరానికి ఉపయోగించిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విలేకర్ల సమావేశంలో సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సై హరిబాబు పాల్గొన్నారు.

అజేయ లంక...

- వరుసగా నాలుగో విజయంతో గ్రూప్ 'బి'లో టాప్ ర్యాంక్
- చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై గెలుపు



అసలంక

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నీ శ్రీలంక జట్టు లీగ్ దశను అజేయంగా ముగించింది. గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం స్కాట్లాండ్ జట్టుతో జరిగిన చివరిదైన నాలుగో మ్యాచ్‌లో శ్రీలంక 82 పరుగుల తేడాతో గెలిచింది. వరుసగా నాలుగో విజయంతో శ్రీలంక ఎనిమిది పాయింట్లతో గ్రూప్ 'బి' టాపర్‌గా నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.3 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (85 బంతుల్లో 75; 10 ఫోర్లు), చరిత్ అసలంక (65 బంతుల్లో 63; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. స్కాట్లాండ్ బౌలర్లలో మార్క్ వాట్ మూడు, క్రిస్ గ్రీవెస్ నాలుగు వికెట్లు తీశారు. 246 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ 29 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. క్రిస్ గ్రీవెస్ (41 బంతుల్లో 56 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగతావారు విఫలమయ్యారు. లంక బౌలర్లలో తీక్షణ మూడు, హసరంగ రెండు వికెట్లు పడగొట్టారు.

ఐర్లాండ్‌కు ఊరట...



స్టిర్లింగ్

గ్రూప్ 'బి'లో 'సూపర్ సిక్స్' దశకు చేరుకోలేకపోయిన రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 138 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టును ఓడించి విజయంతో టోర్నీని ముగించింది. ముందుగా ఐర్లాండ్ 50 ఓవర్లలో 4 వికెట్లకు 349 పరుగులు సాధించింది. ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ (134 బంతుల్లో 162; 15 ఫోర్లు, 8 సిక్స్‌లు) భారీ సెంచరీ... బాల్‌బిర్నీ (66; 5 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ టెక్టర్ (33 బంతుల్లో 57; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం యూఏఈ 39 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, స్కాట్లాండ్, ఒమన్... గ్రూప్ 'ఎ' నుంచి జింబాబ్వే, నెదర్లాండ్స్, వెస్టిండీస్ జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధించాయి. గురువారం నుంచి 'సూపర్ సిక్స్' దశ మ్యాచ్‌లు మొదలవుతాయి.

భారత్, కువైట్ మ్యాచ్ 'డ్రా'

బెంగళూరు: దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భాగంగా మంగళవారం భారత్, కువైట్ జట్ల మధ్య జరిగిన చివరి లీగ్ మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. భారత్ తరఫున కెప్టెన్ సునీల్ ఛెత్రి (45+2వ ని.లో) కెరీర్‌లో 92వ గోల్ సాధించగా... 90+2వ నిమిషంలో భారత ప్లేయర్ అన్వర్ చేసిన సెల్ఫ్ గోల్‌తో కువైట్ స్కోరును సమం చేసింది. లీగ్ దశ తర్వాత భారత్, కువైట్ ఏడు పాయింట్లతో సమంగా నిలిచినా... గోల్స్ అంతరం కారణంగా కువైట్ టాపర్‌గా నిలిచింది. భారత్‌కు రెండో స్థానం దక్కింది.



అంకిత ఓటమి



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ అంకిత రైనా తొలి రౌండ్ మ్యాచ్‌లో 6–3, 6–7 (5/7), 1–6తో జెస్సికా (స్పెయిన్) చేతిలో ఓటమి పాలైంది. అంకితకు 12,750 పౌండ్లు (రూ. 13 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

భారత్ శుభారంభం

బుసాన్: ఆసియా పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు శుభారంభం చేసింది. ఆతిథ్య దక్షిణ కొరియాతో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 76–13 పాయింట్ల తేడాతో... చైనీస్ తైపీ జట్టుతో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 53–19తో నెగ్గింది.

కౌంట్‌డౌన్ మొదలు...



బాబర్ ఆజమ్, రోహిత్ శర్మ (ఫైల్)

100 రోజుల్లో వన్డే ప్రపంచకప్

నరేంద్ర మోదీ స్టేడియం

- పూర్తి షెడ్యూల్ విడుదల చేసిన ఐసీసీ
- అక్టోబర్ 5న తొలి పోరు
- అక్టోబర్ 15న భారత్, పాక్ మ్యాచ్
- నవంబర్ 19న ఫైనల్
- కీలక మ్యాచ్‌లన్నీ అహ్మదాబాద్‌లోనే

ఈ శీతాకాలం మునుపటిలా చల్లగా ఉండదు. వన్డే ప్రపంచకప్‌తో హీటెక్కనుంది. ఫోర్లు, సిక్సర్లతో క్రికెట్ మజాను పంచనుంది. భారీ స్కోర్లతో, వీర విహారాలతో సాగిపోనుంది. బంతి, బ్యాట్ పైచేయి తేల్చుకునేందుకు సమాయాత్తమైంది. బోరుకొట్టే మ్యాచ్‌లు కాకుండా... హోరెత్తించే షోలతో ఈ మెగా ఈవెంట్ మురిపించేందుకు సిద్ధమైంది. సెంచరీలు కొట్టే బ్యాటర్లు, హ్యాట్రిక్స్ వికెట్లు తీసే బౌలర్లు... ప్రపంచకప్ కలను సాకారం చేసుకునేందుకు తాజా దిగ్గజాలు సై అంటే సై అంటున్నారు.

ముంబై: వన్డే ప్రపంచకప్ అంకానికి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. 12 ఏళ్ల తర్వాత భారత్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తోంది. ఈసారి మాత్రం ఒంటరిగా నిర్వహించనుండటం ఈ కప్‌కున్న మరో ప్రత్యేకత. అందుకేనేమో అన్ని అనుకూల, ప్రతికూల అంశాలను పరిశీలించి.... అంతా కసరత్తు చేశాకే ఆలస్యంగా కేవలం వంద రోజుల ముందే షెడ్యూల్ విడుదల చేశారు. గతంలో ఓ ఏడాది ముందే ఐసీసీ ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఖరారు చేసేది. వాన ముప్పున్న వేదికల్లో సెమీఫైనల్ మ్యాచ్‌లను కేటాయించలేదు. అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగే ఈ మెగా ఈవెంట్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం ముంబైలో విడుదల చేసింది. అక్టోబర్ 5న తెరలేచే ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి నవంబర్ 19న జరిగే టైటిల్ పోరుతో తెర పడనుంది.

హైదరాబాద్‌లో భారత్ మ్యాచ్ లేదు

భారత్‌లోని 10 వేదికల్లో ప్రపంచకప్ మ్యాచ్‌లు ప్రత్యక్షంగా చూడొచ్చు. ఇందులో హైదరాబాద్‌కూ ఆతిథ్య భాగ్యం దక్కింది. కానీ భారత్ ఆడే మ్యాచ్‌కు నోచుకోలేకపోయింది. పాకిస్తాన్ ఆడే రెండు మ్యాచ్‌లతో పాటు న్యూజిలాండ్ ఒక మ్యాచ్ ఉప్పల్ మైదానంలో జరుగుతాయి. ఈ రెండింటికి ప్రత్యర్థులు ఖరారు కాలేదు. ప్రస్తుతం జింబాబ్వేలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా రెండు జట్లు ఖరారవుతాయి. ముంబై, పుణే, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్, ధర్మశాల, లక్నో, కోల్‌కతా, బెంగళూరు ఈ 9 వేదికల్లో ఐదేసి చొప్పున మ్యాచ్‌లు నిర్వహిస్తారు.ఈ మెగా టోర్నీకి సన్నాహాల్లో భాగంగా భారత జట్టు రెండు వామప్ మ్యాచ్‌లు ఆడనుంది. సెప్టెంబర్ 30న గువాహటిలో ఇంగ్లండ్ జట్టుతో... అక్టోబర్ 3న త్రివేండ్రంలో క్వాలిఫయర్–1 జట్టుతో టీమిండియా తలపడుతుంది.



గత ఫార్మాటే

ఈ మెగా ఈవెంట్ కూడా గత ప్రపంచకప్ (2019) ఫార్మాట్‌లాగే రౌండ్ రాబిన్, నాకౌట్ పద్ధతిలో జరుగుతుంది. అంటే పది జట్లు ప్రతీ ప్రత్యర్థితోనూ లీగ్ దశలో తలపడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో ఉన్న జట్లు సెమీఫైనల్స్‌కు (నాకౌట్) అర్హత సాధిస్తాయి. తొలి సెమీఫైనల్‌కు నవంబర్ 15న ముంబై... రెండో సెమీఫైనల్‌కు నవంబర్ 16న కోల్‌కతా వేదిక కానున్నాయి. భారత్ గనుక సెమీఫైనల్ చేరితే ముంబైలో ఆ మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ సెమీఫైనల్లో భారత్‌కు పాకిస్తాన్ ఎదురైతే ఈ సెమీఫైనల్ కోల్‌కతాలో జరుగుతుంది. నాకౌట్ మ్యాచ్‌లకే (సెమీఫైనల్స్, ఫైనల్) రిజర్వ్ డేలున్నాయి.

ఆరు 'డే' మ్యాచ్‌లు... మిగతావి డే–నైట్...

ఈ టోర్నీలో మొత్తం జరిగే మ్యాచ్‌లు 48. లీగ్ దశలో 45 పోటీలు జరుగుతాయి. ఇందులో కేవలం ఆరు లీగ్‌లే డే మ్యాచ్‌లుగా ఉదయం గం. 10:30 గంటలకు మొదలవుతాయి. మిగతావన్నీ డే–నైట్ మ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. వీటితో పాటు నాకౌట్ మ్యాచ్‌లు కూడా డేనైట్ వన్డేలే! డే–నైట్ మ్యాచ్‌లు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయి.

దాయాదులు దంచుకునేది...

మాంచి క్రికెట్ కిక్ ఇచ్చే... అందరూ లుక్కేసే మ్యాచ్ భారత్, పాకిస్తాన్ పోరు! చిరకాల ప్రత్యర్థుల మధ్య అక్టోబర్ 15న అహ్మదాబాద్‌లో లీగ్ మ్యాచ్ జరుగుతుంది. ఇదే కాదు... ఫైనల్ (నవంబర్ 19) సహా 2019 టోర్నీ ఫైనలిస్టులు ఇంగ్లండ్, న్యూజిలాండ్‌ల మధ్య టోర్నీ ఆరంభ పోరు (అక్టోబర్ 5న), ఇంగ్లండ్, ఆస్ట్రేలియా (నవంబర్ 4) తలపడే మేటి మ్యాచ్‌లను లక్ష పైచిలుకు ప్రేక్షకులు చూసే నరేంద్ర మోదీ స్టేడియంలోనే ఏర్పాటు చేశారు. గత మూడు ప్రపంచకప్‌లలో (2011లో భారత్; 2015లో ఆస్ట్రేలియా; 2019లో ఇంగ్లండ్) ఆతిథ్య జట్టు విజేతగా నిలువడం విశేషం.

నాలుగోసారి పూర్తిగా ఇండియాలోనే....

భారత్ ఆతిథ్యమివ్వబోయే నాలుగో వన్డే ప్రపంచకప్ ఇది. ఈసారి పూర్తిగా భారత్‌లోనే జరుగనుండటం ఈ వరల్డ్‌కప్ ప్రత్యేకత! తొలిసారిగా 1987లో పాక్‌తో కలిసి, రెండోసారి 1996లో పాక్, లంకలతో ఉమ్మడిగా, మూడోసారి 2011లో లంక, బంగ్లాదేశ్‌లతో సంయుక్తంగా భారత్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చింది. ఇప్పటి వరకు 12 సార్లు వన్డే ప్రపంచకప్ జరగ్గా... రెండోసారి మాత్రమే ఆతిథ్య జట్టు టోర్నీ తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగడంలేదు. 1996లో భారత్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచకప్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ జరగ్గా... 2023లోనూ ఈ రెండు జట్ల మధ్యే తొలి మ్యాచ్ జరగనుండటం విశేషం.

ఇదీ షెడ్యూల్

అక్టోబర్ 5: ఇంగ్లండ్ x న్యూజిలాండ్	అహ్మదాబాద్
అక్టోబర్ 6: పాకిస్తాన్ x క్వాలిఫయర్-1	హైదరాబాద్
అక్టోబర్ 7: దక్షిణాఫ్రికా x క్వాలిఫయర్-2	ఢిల్లీ
అక్టోబర్ 7: బంగ్లాదేశ్ x అఫ్గానిస్తాన్	ధర్మశాల
అక్టోబర్ 8: భారత్ x ఆస్ట్రేలియా	చెన్నై
అక్టోబర్ 9: న్యూజిలాండ్ x క్వాలిఫయర్-1	హైదరాబాద్
అక్టోబర్ 10: ఇంగ్లండ్ x బంగ్లాదేశ్	ధర్మశాల
అక్టోబర్ 11: భారత్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ
అక్టోబర్ 12: పాకిస్తాన్ x క్వాలిఫయర్-2	హైదరాబాద్
అక్టోబర్ 13: ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	లక్నో
అక్టోబర్ 14: ఇంగ్లండ్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ
అక్టోబర్ 14: న్యూజిలాండ్ x బంగ్లాదేశ్	చెన్నై
అక్టోబర్ 15: భారత్ x పాకిస్తాన్	అహ్మదాబాద్
అక్టోబర్ 16: ఆస్ట్రేలియా x క్వాలిఫయర్-2	లక్నో
అక్టోబర్ 17: దక్షిణాఫ్రికా x క్వాలిఫయర్-1	ధర్మశాల
అక్టోబర్ 18: న్యూజిలాండ్ x అఫ్గానిస్తాన్	చెన్నై
అక్టోబర్ 19: భారత్ x బంగ్లాదేశ్	పుణే
అక్టోబర్ 20: ఆస్ట్రేలియా x పాకిస్తాన్	బెంగళూరు
అక్టోబర్ 21: ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	ముంబై
అక్టోబర్ 21: క్వాలిఫయర్-1 x క్వాలిఫయర్-2	లక్నో
అక్టోబర్ 22: భారత్ x న్యూజిలాండ్	ధర్మశాల
అక్టోబర్ 23: పాకిస్తాన్ x అఫ్గానిస్తాన్	చెన్నై
అక్టోబర్ 24: దక్షిణాఫ్రికా x బంగ్లాదేశ్	ముంబై
అక్టోబర్ 25: ఆస్ట్రేలియా x క్వాలిఫయర్-1	ఢిల్లీ
అక్టోబర్ 26: ఇంగ్లండ్ x క్వాలిఫయర్ 2	బెంగళూరు
అక్టోబర్ 27: పాకిస్తాన్ x దక్షిణాఫ్రికా	చెన్నై
అక్టోబర్ 28: క్వాలిఫయర్-1 x బంగ్లాదేశ్	కోల్‌కతా
అక్టోబర్ 28: ఆస్ట్రేలియా x న్యూజిలాండ్	ధర్మశాల
అక్టోబర్ 29: భారత్ x ఇంగ్లండ్	లక్నో
అక్టోబర్ 30: అఫ్గానిస్తాన్ x క్వాలిఫయర్-2	పుణే
అక్టోబర్ 31: పాకిస్తాన్ x బంగ్లాదేశ్	కోల్‌కతా
నవంబర్ 1: న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా	పుణే
నవంబర్ 2: భారత్ x క్వాలిఫయర్-2	ముంబై
నవంబర్ 3: క్వాలిఫయర్-1 x అఫ్గానిస్తాన్	లక్నో
నవంబర్ 4: ఇంగ్లండ్ x ఆస్ట్రేలియా	అహ్మదాబాద్
నవంబర్ 4: న్యూజిలాండ్ x పాకిస్తాన్	బెంగళూరు
నవంబర్ 5: భారత్ x దక్షిణాఫ్రికా	కోల్‌కతా
నవంబర్ 6: బంగ్లాదేశ్ x క్వాలిఫయర్-2	ఢిల్లీ
నవంబర్ 7: ఆస్ట్రేలియా x అఫ్గానిస్తాన్	ముంబై
నవంబర్ 8: ఇంగ్లండ్ x క్వాలిఫయర్-1	పుణే
నవంబర్ 9: న్యూజిలాండ్ x క్వాలిఫయర్-2	బెంగళూరు
నవంబర్ 10: దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్	అహ్మదాబాద్
నవంబర్ 11: భారత్ x క్వాలిఫయర్-1	బెంగళూరు
నవంబర్ 12: ఇంగ్లండ్ x పాకిస్తాన్	కోల్‌కతా
నవంబర్ 12: ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్	పుణే
నవంబర్ 15: తొలి సెమీఫైనల్	ముంబై
నవంబర్ 16: రెండో సెమీఫైనల్	కోల్‌కతా
నవంబర్ 19: ఫైనల్	అహ్మదాబాద్

జట్లు: భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్, క్వాలిఫయర్-1, క్వాలిఫయర్-2 (ఈ రెండు జట్లు ప్రస్తుతం జింబాబ్వేలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా ఖరారవుతాయి)

సినిమా



విహార యాత్రలో...

'ఆర్ఆర్ఆర్' సినిమా తెరకెక్కించడం, ఆ తర్వాత మూవీ ప్రమోషన్, ఆ తర్వాత ఆస్కార్ అవార్డుకి సంబంధించిన ప్రమోషనల్ ఈవెంట్స్‌తో దర్శకుడు రాజమౌళి మూడు నెలల క్రితం వరకూ ఫుల్ బిజీగా గడిపారు. నెక్ట్స్ మహేశ్ బాబు హీరోగా భారీ సినిమాకి దర్శకత్వం వహించనున్నారు రాజమౌళి. ఈ చిత్రానికి విజయేంద్ర ప్రసాద్ కథ సమకూరుస్తున్నారు. ఇంకా కథ పూర్తి కాలేదు. ఈలోపు ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ప్లాన్ చేసుకుంటూనే కుటుంబంతో కలిసి విహార యాత్ర ప్లాన్ చేసుకున్నారు రాజమౌళి. తమిళనాడులో గల తూత్తుక్కుడిలో కుటుంబంతో కలిసి వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తున్నారాయన. భార్య రమ, కొడుకు కార్తికేయ, కోడలు పూజా, కుమార్తె మయూఖతో కలిసి హాలిడే బ్రేక్‌లో ఉన్నారు రాజమౌళి. తూత్తుక్కుడిలోని ఆక్వా అవుట్ బ్యాక్ రిసార్ట్‌లో ఈ ఫ్యామిలీ బస చేసింది. అక్కడికి వెళ్లిన గుర్తుగా మొక్కలు నాటారు రాజమౌళి. ఈ విహార యాత్రకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

నమ్మకంగా ఉన్నాం

\- నాగశౌర్య



● నాగశౌర్య, యుక్తి తరేజ, పవన్ బాసంశెట్టి

''రంగబలి' చిత్రకథని పవన్ చెప్పినట్లుగానే తీశాడు. ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాతో అందరూ కనెక్ట్ అవుతారు. విజయంపై చాలా నమ్మకంగా ఉన్నాం'' అని హీరో నాగశౌర్య అన్నారు. నూతన దర్శకుడు పవన్ బాసంశెట్టి తెరకెక్కించిన చిత్రం 'రంగబలి'. నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా జూలై 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ బాసంశెట్టి మాట్లాడుతూ– ''పూర్తి స్థాయి వినోదం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రంగబలి'' అన్నారు.

నిఖిల్‌ని చూసి గర్వపడుతున్నా - నాగచైతన్య

''స్పై థ్రిల్లర్ సినిమాలు తీయడం అంత సులభం కాదు.. అది ఒక సవాల్. ఎందుకంటే ఇలాంటి హాలీవుడ్ సినిమాలను ఓటీటీల్లో చూసేస్తున్నారు. కానీ, 'స్పై' టీజర్, ట్రైలర్ చూశాక చాలా బాగా అనిపించింది. అంతర్జాతీయ స్థాయి విలువలకు ఏ మాత్రం తగ్గలేదు. రాజశేఖర్, చరణ్ తేజ్‌ల ప్యాషన్ ఏంటో తెలుస్తోంది. ఈ సినిమా ఘన విజయం సాధించాలి'' అని హీరో నాగచైతన్య అన్నారు. నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్యామీనన్ జంటగా గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్పై'. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై కె.రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు(గురువారం) విడుదలకానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నాగచైతన్య మాట్లాడుతూ– ''నిఖిల్ అంటే నాకు చాలా ఇష్టం. 'హ్యాపీడేస్' తో కెరీర్ మొదలుపెట్టి, 'స్వామిరారా, కార్తికేయ' తో ఓ ట్రెండ్ సెట్ చేసి, 'కార్తికేయ 2' తో బాక్సాఫీస్‌ని షేక్ చేశాడు.. తనని చూసి నేను చాలా గర్వపడుతున్నాను. 'కార్తికేయ 2' తో ఒక ట్రెండ్ ఎలా సెట్ చేశాడో.. 'స్పై' చిత్రంతో ఆ ట్రెండ్ దాటి తర్వాతి స్థాయికి వెళతాడనే నమ్మకం ఉంది'' అన్నారు.

నిఖిల్ సిద్ధార్థ్ మాట్లాడుతూ–''సుభాష్ చంద్రబోస్ వంటి ఒక గొప్ప వ్యక్తి గురించి ఉన్న సినిమా 'స్పై'. నాలుగురోజుల కిందట ఈ మూవీ ఫైనల్ కాపీ చూశాక 'థ్యాంక్యూ గ్యారీ' అన్నాను.. అంత బాగా ఈ మూవీ తీశాడు. ఇలాంటి సినిమా చేసినందుకు యూనిట్ అంతా గర్వపడుతున్నాం. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా ఇది'' అన్నారు. ''ఒక్క ఫోన్ కాల్‌తో 'స్పై' ప్రీ రిలీజ్ వేడుకకి వచ్చిన నాగచైతన్యగారికి థ్యాంక్స్'' అన్నారు కె.రాజశేఖర్ రెడ్డి.



● నిఖిల్, రాజశేఖర్ రెడ్డి, నాగచైతన్య, ఐశ్వర్యామీనన్

గ్యారీ బీహెచ్ మాట్లాడుతూ–''డాక్టర్ అయిన నేను సినిమా ఇండస్ట్రీకి వెళ్తానంటే ఎవరూ ఒప్పుకోరు. కానీ, నా తల్లితండ్రులు ఒప్పుకుని, నన్ను ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు. 'స్పై' చాలా బాగా తీశావంటూ నిఖిల్‌గారు నన్ను హత్తుకోవడంతో సినిమా విజయంపై మరింత నమ్మకం పెరిగింది'' అన్నారు. ఈ వేడుకలో ఈడీ ఎంటర్‌టైన్ మెంట్స్ సీఈఓ చరణ్ తేజ్, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల, కెమెరామేన్ వంశీ పచ్చిపులుసు, యూవీ క్రియేషన్స్ నిర్మాత వంశీ, నటీనటులు సాన్య ఠాకూర్, ఆర్యన్ రాజేష్ పాల్గొన్నారు.

ఆగస్టులో ఆరంభం



● నీరజ ● సిద్ధు

దాదాపు దశాబ్ద కాలంగా ఇండస్ట్రీలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా రాణిస్తున్నారు నీరజ కోన. ఎన్టీఆర్, రామ్‌చరణ్, సూర్య వంటి టాప్ స్టార్స్ చేసిన సినిమాలకు నీరజ కోన కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేశారు. సమంత, రకుల్ ప్రీత్‌సింగ్ వంటివారికి కూడా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశారు. తాజాగా నీరజ కోన దర్శకురాలిగా మెగా ఫోన్ పట్టనున్నారని సమాచారం. రొమాంటిక్ థ్రిల్లింగ్ లవ్‌స్టోరీగా రూపొందనున్న ఈ సినిమాలో 'డీజే టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తారని తెలిసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టు లేదా నవంబరులో ప్రారంభం కానుందట. ఈ సినిమాకు ప్రముఖ ఛాయాగ్రాహకులు పీసీ శ్రీరామ్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, రైటర్ మిథున్ చైతన్యను ఎంపిక చేసినట్లు సమాచారం.

యాక్టర్ అనిపించుకోవడం కష్టం

\- శ్రీ విష్ణు



''స్టార్ అవ్వడం అనేది మన చేతుల్లో లేదు. అయితే ఎంచుకునే పాత్రలతో మంచి యాక్టర్ అవ్వడం అనేది మన చేతుల్లోనే ఉంటుంది. కానీ యాక్టర్ అనిపించుకోవడం అనేది చాలా కష్టం. 'స్టార్' లేదా 'యాక్టర్' అని ఎవరైనా నాకు అప్షన్ ఇస్తే.. యాక్టర్ అవుతాననే చాలెంజ్‌నే తీసుకుంటాను'' అని శ్రీ విష్ణు అన్నారు. శ్రీ విష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు చెప్పిన విశేషాలు..

● 'సామజ వరగమన'లో బాలసుబ్రహ్మణ్యం అనే యువకుడి పాత్రలో నటించాను. థియేటర్ బాక్సాఫీస్‌లో ఉద్యోగం చేస్తుంటాడు బాలసుబ్రహ్మణ్యం. సో.. కొంతమంది హీరోల డైలాగ్స్ ఈ సినిమాలో ఉంటాయి. నవ్వించడమే పనిగా పెట్టుకుని మేం తీసిన సినిమా ఇది.యూత్‌కు, ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఈ సినిమా బాగా నచ్చుతుంది. సినిమాలో ఓ సర్‌ప్రైజింగ్ పాయింట్ కూడా ఉంది. తెలుగు సినిమాల్లో ఇప్పటివరకూ ఇలాంటి పాయింట్ రాలేదనే అనుకుంటున్నాం. ● ఇండస్ట్రీలో పెద్ద స్టార్స్ ఎక్కువైపోయారు. పెద్ద దర్శకులు తక్కువైపోయారు. కొన్నిసార్లు స్టార్ డైరెక్టర్స్‌కే స్టార్ హీరోలు దొరకడం లేదు కూడా. ఇక స్టార్ దర్శకులు మాలాంటి వారితో సినిమాలు చేయాలంటే అది టఫ్ అవుతుంది. దీనికి తోడు మార్కెట్ సమీకరణాలు కూడా ఉంటాయి. అలాగే పెద్ద దర్శకులు కొంతమంది దాదాపు రెండేళ్ల వరకూ సినిమాలను ప్లాన్ చేసుకుంటున్నారు. నేను సమయం వృథా కాకూడదని కొత్త దర్శకులతో, వీలైతే నేను ఇంట్రడ్యూస్ చేసిన వారితోనే మళ్లీ సినిమాలు చేసుకునేలా ప్లాన్ చేసుకుంటాను. ● విలన్ రోల్స్ చేయడం నాకు ఇష్టమే. అయితే 'వీరభోగ వసంతరాయలు', 'తిప్పరా మీసం' సినిమాల్లో నెగటివ్ టచ్ ఉండే రోల్స్ చేస్తే ప్రేక్షకులు అంతగా యాక్సెప్ట్ చేయలేదనిపించింది. అందుకే విలన్ రోల్స్ చేయాలనుకోవడం లేదు. ● ప్రస్తుతం హర్ష కొనుగంటి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌లో ఓ సినిమా చేస్తున్నాను. అలాగే 'రాజరాజ చోర'కు ప్రీక్వెల్‌గా హసిత్ గోలి దర్శకత్వంలోనే ఓ సినిమా చేస్తున్నాను.

కథే హీరో

\- డీవై చౌదరి

రోహిత్ బెహల్, అపర్ణా జనార్దనన్ జంటగా నటించిన చిత్రం 'లవ్ యూ రామ్'. డీవై చౌదరి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా కథ అందించిన దర్శకుడు కె. దశరథ్ మరో నిర్మాత. ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో డీవై చౌదరి మాట్లాడుతూ – ''దశరథ్, నేను గతంలో '16 డేస్' అనే సినిమా చేశాం. అయితే ఇటీవల కుటుంబం అంతా కలిసి చూడదగ్గ సినిమాలు రావడం తగ్గింది. దీంతో ఓ క్లీన్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందించాలని 'లవ్ యూ రామ్' తీశాం. ఇది డిఫరెంట్ లవ్‌స్టోరీ. కథే హీరో. అందుకే కొత్తవారిని తీసుకున్నాం. కథ విషయానికొస్తే.. ప్రేమించడమే జీవితం అని నమ్మే అమ్మాయి, నమ్మించడమే జీవితం అనుకునే అబ్బాయి మధ్య నెలకొన్న సంఘర్షణే ఈ చిత్రం. నేను, దశరథ్ మూడు వెబ్ సిరీస్‌లకు కథలు రెడీ చేశాం. త్వరలో దశరథ్ నుంచి ఓ పెద్ద ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రకటన వస్తుంది'' అన్నారు.



నారాయణతో సుధాకర్‌కి బ్రేక్ వస్తుంది

\- డైరెక్టర్ అనిల్ రావిపూడి

''నారాయణ అండ్ కో' ట్రైలర్ అద్భుతంగా ఉంది. సుధాకర్ నా స్నేహితుడు. తనతో నాది లాంగ్ జర్నీ. తనకి 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చిత్రంతో చక్కని టేకాఫ్ వచ్చింది. 'నారాయణ అండ్ కో'తో మంచి బ్రేక్ వస్తుందనుకుంటున్నాను'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి అన్నారు. సుధాకర్ కోమాకుల హీరోగా చిన్నా పాపిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, విజయ్ కనకమేడల, హీరో తిరువీర్, నిర్మాత రాజ్ కందుకూరి, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అతిథులుగా హాజరై, 'నారాయణ అండ్ కో' విజయం సాధించాలి అన్నారు. సుధాకర్ కోమాకుల మాట్లాడుతూ– ''నారాయణ అండ్ కో' సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ సినిమా'' అన్నారు. ''ఇది ఫ్యామిలీ ఫండింగ్ మూవీ. చాలామంది సపోర్ట్‌తో ఈ సినిమా చేశాం'' అన్నారు దర్శక–నిర్మాత చిన్నా పాపిశెట్టి.



● అనిల్, సుధాకర్, విజయ్

యాక్షన్ థ్రిల్లర్

జగన్‌మోహన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎస్–99'. శ్వేతా వర్మ హీరోయిన్‌గా యతీష్, నందిని నిర్మిస్తున్న ఈ సినిమా మోషన్ టైటిల్‌ను నిర్మాత రమేష్‌ప్రసాద్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''మా నాన్నగారు (ప్రముఖ దర్శక–నిర్మాత ఎల్వీ ప్రసాద్) సినిమాల కోసం చాలా కష్టపడ్డారు.. ఆ కష్టమే నన్ను ఉత్సాహపరిచి, ఇండస్ట్రీవైపు వచ్చేలా చేసింది. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన నేను ప్రపంచవ్యాప్తంగా ప్రసాద్ ల్యాబ్స్‌ను నెలకొల్పడం హ్యాపీగా ఉంది.



● యతీష్, రమేష్‌ప్రసాద్, జగన్‌మోహన్

ప్రస్తుతం సినిమాలు సరిగ్గా ఆడటం లేదు.. కానీ చాలామంది కష్టపడి సినిమాలు చేస్తున్నారు. 'ఎస్–99' టైటిల్ కొత్తగా ఉంది. ఈ మూవీ సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు జగన్ మోహన్. ''ఎస్–99' లాంటి చిత్రాలు మరిన్ని తీయడానికి రెడీగా ఉన్నాం'' అన్నారు యతీష్.